నవ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 14: నవ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 3,000 మంది ఉపాధ్యాయులకు సొంత ఖర్చులతో రూ.5 లక్షల ఉచిత ప్రమాద బీమా అందించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు శేఖర్ రావు, రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, పీఆర్ఎస్ఎంఏ నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ట్రెజరర్ నాగిరెడి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 14: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని హిందూ శ్మశానవాటికలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్సీపురంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. శ్మశానవాటికలో పలు అభివృద్ధి పనుల విషయమై ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రభు, నాయకులు మల్లేశ్, అశోక్, నవీన్‌గౌడ్, నర్సింగ్‌రావు, సుంకుస్వామి, నర్సింహ, నాగరాజు, కృష్ణ, శిరోమణి, ఎల్లం, నిఖిల్, రఫీ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

తండా సమస్యల పరిష్కారానికి కృషి

పీచెర్యాగడి తండావాసులతో మాట్లాడుతున్న వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి

కోహీర్, సెప్టెంబర్14: పీచెర్యాగడి తండాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రముఖ వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పీచెర్యాగడి తండాలను సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. కొత్త, పాత తండాల్లో మురుగు నీటిని బయటకు పంపించేందుకు కాల్వలను నిర్మిస్తామని హామీనిచ్చారు. వెంటనే సైడ్ డ్రైన్ పనులను ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వినోద్‌రాథోడ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం

సాముహిక భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కోహీర్, సెప్టెంబర్ 14: జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేట గణేశ్ యూత్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన రాచన్నపేట వినాయక మండపంలో గీత జ్ఞాన వాహిని ఆధ్వర్యంలో శనివారం సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు హైవే

జాతీయ రహదారిని పక్క నుంచి ప్రవహిస్తున్న మురికి నీరు

కంది, సెప్టెంబర్ 14: కంది నుంచి వెళ్లే జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. సంగారెడ్డి వైపు నుంచి వచ్చే రహదారిని ఆనుకొని మురికి నీరంతా రోడ్డుపక్కన ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రహదారికి ఇరువైపులా గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిమిషంలో వేల సంఖ్యలో హైస్పీడ్‌తో వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు దిగితే జారిపడతామేమోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లా, మండల అధికారులు నిత్యం ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలుష్య కలవరం

- కాలుష్య కాటుకు బలవుతున్న మూగజీవాలు
- అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పారిశ్రామిక వాడల ప్రజలు

ఖాజీపల్లి పారిశ్రామికవాడలో వర్షం నీటిలో ప్రవహిస్తున్న రసాయన వ్యర్థాలు(ఫైల్)

జిన్నారం, సెప్టెంబర్ 14: నిత్యం కాలుష్య జలాలు కలవరపెడుతున్నాయి. మండలంలోని పారిశ్రామికవాడలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని చట్టాలున్నా నిబంధనలను పట్టించుకోని పరిశ్రమలపై మాత్రం ఎలాంటి చర్యలు ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యాల తీరులోను మార్పు రాకపోవడంతో ఏదో ఒక చోట మూగజీవలు బలవుతున్నాయి. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా రసాయన వ్యర్థాల విడుదల

మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామికవాడలోని రసాయన వ్యర్థాల విడుదల విచ్చలవిడిగా పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలను రసాయన పరిశ్రమలు అనుకూలంగా మార్చుకొని పరిశ్రమల్లో నిల్వ ఉన్న రసాయన వ్యర్థాలను వరదలో కలిపి వదులుతున్నాయి. ఇటీవల గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమ రసాయన వ్యర్థాలను మోటార్ల ద్వారా బయటకు వదులుతుండగా గ్రామస్తులు పట్టుకొని పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వర్షాలు కురిసిన వారం రోజులపాటు ఇదే తీరుగా పరిశ్రమలు వ్యవహరించాయి. శాంపిల్స్ సేకరించిన పీసీబీ అధికారులు చప్పుడు చేయడం లేదని, ఇదే పరిశ్రమపై గ్రామస్తులు పీసీబీ మెంబర్ సెక్రెటరీని కలిసి ఫిర్యాదు చేశారు. రాత్రింబవళ్లు రసాయన పరిశ్రమల కాలుష్యం పొగలు, రసాయన వ్యర్థాల విడుదల ఇక్కడ నిత్య ప్రక్రియగా కొనసాగుతున్నది.

కాలుష్యకాసారాలుగా చెరువులు, కుంటలు

పారిశ్రామిక వాడల్లోని చెరువులు, కుంటలు ఇప్పటికే పూర్తిగా కాలుష్యం బారిన పడ్డాయి. బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్న అధికారులు, నాయకుల మాటలు మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. గడ్డపోతారంలోని అయ్యమ్మ చెరువు, ఖాజీపల్లిలోని ఖాజీచెరువు, ధరిమి చెరువు, బొల్లారంలోని ఆసాని కుంట రసాయనాలతో నిండిపోయాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయం అనే పదాన్ని పూర్తిగా మర్చిపోయారు. పరిశ్రమలు వస్తే ఉపాధి లభిస్తుందని అందరం బాగుపడతామని ఆశించిన ప్రజలకు కాలక్రమేనా అశువులు బాసే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటల్లో చేపలు పెంచే పరిస్థితి లేదు. వ్యవసాయం అనే ఊసేలేదు. బోరు నీటికి వినియోగించే పరిస్థితి లేదు. గాలిలోని రసాయనాల ఘాటును పీలుస్తూ అనారోగ్యాలకు ఇక్కడి ప్రజల గురవుతున్నారు. ఆరోగ్యంగా బతకలేని పరిస్థితి నెలకొంది. తిరిగి పూర్వపు స్థితి నెలకొనాలంటే పరిశ్రమలపై కఠిన నిబంధనలను అమలు చేయాలని, పారిశ్రామిక వాడల్లోని చెరువులు, కుంటలను బాగు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

కాలుష్య జలాలు తాగి నెమలి, బర్రె మృతి

కాలుష్య జలాలు తాగి మృతి చెందిన జాతీయ పక్షి నెమలి

జిన్నారం, సెప్టెంబర్ 14: ఖాజీపల్లి పారిశ్రామికవాడలో కాలుష్య జలాలు తాగి బర్రె, జాతీయ పక్షి నెమలి మృతి చెందడం కలకలం రేపింది. శనివారం ఉదయం వీటిని గుర్తించిన గ్రామస్తులు నాయకులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన నెమలి, బర్రె ఫొటోలను పీసీబీ అధికారులకు పంపించారు. నెల రోజుల క్రితం గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన బశెట్టి సాయికుమార్‌కు చెందిన 18 బర్రెలు కాలుష్య జలాలు తాగి మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులు, నాయకులు సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేశారు. ఈ ఘటన మరువకముందే బర్రె, నెమలి మృతి చెందడం ఆందోళన కలిగిస్తున్నది. పరిశ్రమల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుమ్మడిదల, సెప్టెంబర్ 14: గుర్తు తెలియని వ్యక్తి గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో కానుగ చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొంతపల్లి పారిశ్రామికవాడలోని రాక్స్ అండ్ రాక్స్ పరిశ్రమ వెనుక భాగంలో కానుగ చెట్టు పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి(35-40) కానుగ చెట్టుకు తన లుంగీతో ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన ఐదు రోజులు క్రితం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బొంతపల్లి పంచాయతీ బిల్ కలెక్టర్ గౌరీశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి!

గుమ్మడిదల, సెప్టెంబర్ 14: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అన్నారం పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం జాజాపూర్ జిల్లా చందాముండ గ్రామానికి చెందిన రామకంత బెహరా కుమారుడు దివాకర్ బెహరా(19), అతడి బాబాయ్ రవీందర్ బెహరా ఆరు నెలల క్రితం గుమ్మడిదల మండలంలోని అన్నారంలోని ప్రకృతి నివాస్ వెనుక ఒక రేకుల గదిలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో తన అన్న కుమారుడైన దివాకర్ బెహరా రూములో ఉరివేసుకొని మృతి చెందాడని, ఈ విషయాన్ని నిర్మల్‌దాస్ అనే వ్యక్తి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా స్నేహితులతో కలిసి వెళ్లి పరిశీలించానని, ఈ ఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి బాబాయ్ రవీందర్ బెహరా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాయికోడ్ ఎస్సైగా నారాయణ

రాయికోడ్, సెప్టెంబర్ 14: రాయికోడ్ ఎస్సైగా నారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై కృష్ణయ్య సంగారెడ్డి డీసీఆర్‌బీకి బదిలీపై వెళ్లడంతో సంగారెడ్డి డీసీఆర్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నారాయణ రాయికోడ్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై నారాయణ మాట్లాడుతూ.. మండలంలో ప్రతిఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ప్రజలు సమస్యలను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిచే చర్యలు తప్పవని హెచ్చరించారు. గణేశ్ నిమజ్జనాలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

వైభవంగా గణేశ్ శోభాయాత్ర

హత్నూరలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో భక్తులు

హత్నూర, సెప్టెంబర్ 14: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు హత్నూర మండలంలో ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం హత్నూరతోపాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలను వైభవంగా నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టిన నిర్వాహకులు సాయంత్రం గణనాథుడి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.



పూజల్లో పాల్గొన్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

వినాయక మండపాల్లో ఘనంగా పూజలు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 14: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాల్లో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్, నాయికోటి బస్తీ, సాయిగణేశ్ కాలనీ, గౌతమ్ నగర్, బృందావన్ కాలనీల్లో వినాయక మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ పూజల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు చక్కగా నిర్వహిస్తున్నారని అభినందించారు. నిమజ్జనాలకు పూర్తిస్థాయిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు.

బొల్లారం: గణపతి మండపంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్ బంజారా భవన్‌లో సమావేశమైన పీఆర్టీయూ నేతలు

కోహీర్, సెప్టెంబర్ 14: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ నేతలు డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో ఆయా మండలాల పీఆర్టీయూ అధ్యక్షులు డాక్టర్ తులసీరామ్‌రాథోడ్, చంద్రురాథోడ్, విఠల్, రత్నయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేయాలన్నారు. అన్ని దవాఖానల్లో ఉచిత వైద్యసేవలు అందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పీఎస్‌హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. 2024-26కు సంబంధించి సంఘం ఎన్నికలు నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు వరాలు, శ్రీనివాస్, సురేందర్, బాలయ్య, నర్సయ్య, ప్రదీప్‌కుమార్, శివరాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్జున్ చవ్వాణ్, నాగయ్యస్వామి, రమేశ్‌బానోత్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభు, మాణయ్య, మదన్‌గోపాల్ ఉన్నారు.

తెలంగాణ పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

కోహీర్, సెప్టెంబర్ 14: జహీరాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో శనివారం తెలంగాణ పీఆర్టీయూ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జహీరాబాద్ రూరల్ అధ్యక్షుడిగా డాక్టర్ తులసీరామ్ రాథోడ్, కార్యదర్శిగా అశోక్, అసోసియేట్ అధ్యక్షులుగా బాగయ్య, సంగమేశ్వర్, శివనారాయణ, వెంకటేశం, మహిళా ఉపాధ్యక్షురాలిగా సంగీతను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా భాస్కర్, విశ్వనాథ్, మహిళా కార్యదర్శిగా సౌజన్యపవార్ ఎన్నికయ్యారు. జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా తుకారాం చవ్వాణ్, అసోసియేట్ అధ్యక్షులుగా హుస్సేన్, వెంకటస్వామిగౌడ్, రమేశ్‌పవార్, హన్మంతుపవార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ప్రణతి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అరుణకిరణ్, కార్యదర్శి రాజ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా మీరాథోడ్ ఎన్నికయ్యారు. మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా చంద్రురాథోడ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, అసోషియేట్ అధ్యక్షులుగా అర్జున్‌చవాన్, జైపాల్, జితేందర్‌ప్రభు, మోహన్, ఉపాధ్యక్షులుగా కిషన్ బానోత్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కీర్తి, కార్యదర్శులుగా గోవర్ధన్, అమిత్‌కుమార్, మహిళా కార్యదర్శిగా అనురాధ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ పీఆర్టీయూ సంఘం నేతలను రాష్ట్ర నాయకులు అభినందించారు.

ఏచూరి మరణం తీరని లోటు

కందిలో సీతారం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కంది, సెప్టెంబర్ 14: సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు అన్నారు. శనివారం కంది మండల కేంద్రంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ ఏచూరి బతికినంత కాలం ప్రజాశ్రేయస్సు కోసం కృషి చేసి, మరణించిన తర్వాత తన భౌతికదేహాన్ని ఎయిమ్స్ మెడికల్ కళాశాలకు ఇవ్వాలని కోరిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నాయకులు నిజాముద్దీన్, ప్రభాకర్‌గౌడ్, బాలకృష్ణ, సునీత, రాజేశ్ పాల్గొన్నారు.

మాదిగలకు సమన్యాయం చేయాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

కోహీర్, సెప్టెంబర్ 14: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు సమన్యాయం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాదిగలకు సమన్యాయం చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఎస్జీటీయూ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్

హత్నూర, సెప్టెంబర్ 14: ఎస్జీటీయూ సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జహీరాబాద్‌లో డివిజన్ స్థాయి ఎస్జీటీల సమావేశం నిర్వహించి ఎస్జీటీయూ జిల్లా నూతన కమిటీని ఏర్పాటుచేయగా జిల్లా అధ్యక్షుడిగా ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల కిష్టయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు పీఎస్‌హెచ్ఎంను నియమించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని రాష్ట్రశాఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థానక అధ్యక్షుడు మధుసూదన్‌రావు, రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, మొయినొద్దీన్, సిద్దిపేట, మెదక్ జిల్లాల అధ్యక్షులు శ్రీరాంశ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జింక అశోక్ పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
రీజనల్ ఆఫీస్ హైదరాబాద్: 5-1-664, 665 & 669, సురభి ఆర్కేడ్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-500001
లీజుపై ఆవరణ కావలెను
దిగువ తెలిపిన ప్రదేశం వద్ద లీజు అద్దె ప్రాతిపదికన వాణిజ్య / కార్యాలయ ఆవరణ కొరకు యజమానులు / పవర్ ఆఫ్ అటర్నీ హోల్డర్ల నుండి ఆహ్వానిస్తున్నాము.
తెల్లాపూర్, రామచంద్రపురం మండలం, సంగారెడ్డి జిల్లా
సుమారు కార్పెట్ ఏరియా 1200 నుండి 1800 చ.అ. ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే. ఆసక్తిగల పార్టీలు తమ ఆఫర్‌లను సీల్డ్ కవర్‌లో CRM, RO, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-51 వద్ద 29-09-2024 సా॥ 5:00 గం॥ల లోపు దాఖలు చేయవలెను.
తేది: 14.09.2024 సం/- రీజనల్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్



వరద నీటిలో మునిగిన కంది పల్లె ప్రకృతి వనం

నీట మునిగిన ప్రకృతి వనం

కంది, సెప్టెంబర్ 14: ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన కంది పల్లె ప్రకృతి వనం నీట మునిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ప్రకృతి వనంలోకి రావడంతో మొక్కలన్నీ నీట మునిగాయి. వారం రోజులుగా ప్రకృతి వనంలో మోకాళ్ల లోతు నీరు నిలిచిలోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన గేటు నుంచి అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి నెలకొంది. ఇందులో వందల రకాల మొక్కల తోపాటు పలు రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. నిలిచిన మురికి నీటితో ఈ మొక్కలని దెబ్బతిన్నాయి. వనంలో వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులన్నీ నీట మునిగాయి. మండల అధికారుల పర్యవేక్షణ లోపంతోనే వనం నీట మునిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు శుక్రవారం ప్రధాన గేట్ గుండా చిన్న కాల్వను తీసి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మోటర్ల ద్వారా నీటిని బయటకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.